

పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగించాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక

ప్రజాశక్తి - విశాఖపట్నం

రాష్ట్ర ప్రభుత్వం నూతన పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 16 వరకూ విధించిన గడువును పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్షులు కోరూరు అప్పలనాయుడు శనివారం ఓ ప్రకటనలో కోరారు. పింఛన్ల దరఖాస్తులు స్వీకరించిన రోజు నుంచి రాష్ట్రంలో చాలా చోట్ల సర్వర్లు మొరాయించడంతో స్వీకరణలో జాప్యం నెలకొందని తెలిపారు. దరఖాస్తుతో పాటు జత చేయాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఎక్కువ ఉండటం, వాటిలో తప్పుల సవరణకు ఎక్కువ సమయం పడుతున్న నేపథ్యంలో పలువురు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. పత్రాలు సమర్పించడానికి మరింత వెసులుబాటు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వికలాంగత్వాన్ని ధ్రువీకరించే సదరం సర్టిఫికెట్ల జారీ రాష్ట్రంలో నెమ్మదిగా సాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం మూడు నెలలకోసారి నిర్దేశిత తేదీల్లో స్లాటును కేటాయించి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. జూన్ నుంచి ఆగస్టు వరకూ పరీక్షలు జరిగిన వారిలో కొందరికి నేటికీ సర్టిఫికెట్లు రాకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సర్టిఫికెట్ల జారీని వేగవంతం చేయాలని కోరారు.

బిసి రక్షణ చట్టం తీసుకొస్తాం : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్నికల ప్రచారంలో మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 'బిసి రక్షణ చట్టం' తీసుకొస్తున్నామని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. విజయవాడ సమీపంలో ఉన్న గొల్లపూడి బిసి భవన్‌లో శనివారం నిర్వహించిన 'బిసి రక్షణ చట్టం'పై సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఎన్‌టిఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. బిసిలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక గుర్తింపు సిఎం చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యపడుతుందని అన్నారు. బిసిలను కులం, వృత్తుల పేరుతో దూషించినా, సంఘ బహిష్కరణకు గురిచేసినా కఠిన శిక్షలు పడేలా జిల్లాల్లో ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేసి, 2 నెలల్లోనే విచారణ పూర్తిచేసేలా పక్కా నిబంధనలు రూపొందించామన్నారు. ఈ చట్టం కోర్టుల్లో బలంగా నిలబడేలా 156 బిసి కార్పొరేషన్ల ఛైర్మన్లు, ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకున్నామన్నారు. 'ఆదరణ 3.0' పథకాన్ని త్వరలోనే అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమశాఖ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'తుంగభద్ర'కు తగ్గిన ఇన్‌ఫ్లో

- 14 రోజుల్లో 7.59 టిఎంసిలు తగ్గుదల

ప్రజాశక్తి-అనంతపురం

తుంగభద్ర డ్యాంకు వరద ఆగిపోయింది. డ్యాంలో నిల్వలు క్రమంగా కరిగి పోతున్నాయి. ఆగస్టులో తుంగభద్ర డ్యామ్‌కు వచ్చిన ప్రవాహాలు కాస్త సెప్టెంబర్ వచ్చేసరికి పూర్తిగా పడిపోయాయి. ఇప్పుడు ఎగువ తుంగ భద్ర పరీవాహక ప్రాంతాల నుంచి ఇన్ ఫ్లో కాస్త సున్నాకు పడిపోయింది. ఇదే సమయంలో డ్యాం నుంచి కింది కాలువలకు దాదాపు పది వేల క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతోంది.

రిజర్వాయర్ నిల్వలే ఆధారం !

ఆగస్టు 29న తుంగభద్ర రిజర్వాయర్‌లో 96.419 టిఎంసిల నీరు నిల్వ ఉండగా, సెప్టెంబర్ 12వ తేదీ నాటికి అది 88.828 టిఎంసిలకి తగ్గింది. అంటే కేవలం 14 రోజుల్లో సుమారు 7.59 టిఎంసిల నిల్వ తగ్గింది. నీటిమట్టం 1630.62 అడుగుల నుంచి 1628.58 అడుగులకు పడిపోయింది. అంటే రిజర్వాయర్ మట్టం ఏకంగా 2.04 అడుగులకు తగ్గింది. మరోవైపు సాగునీటి అవసరాల కోసం నీటి విడుదల డిమాండ్ మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. సెప్టెంబర్ 12న డ్యాం కుడి, ఎడమ కాల్వలకు మొత్తం 9,963 క్యూసెక్కులు విడుదల చేశారు. ఇందులో ఏపి సరిహద్దు వద్ద హెచ్ఎల్‌సికి నీటి సరఫరా 1,703 క్యూసెక్కులుగా నమోదైంది. గతేడాది ఇదే సెప్టెంబర్ 12న తుంగభద్రకు 17,097 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా ఈసారి సున్నాగా నమోదైంది. గత పదేళ్లుగా ఇదే రోజు సగటు ఇన్ ఫ్లో 23,250 క్యూసెక్కులు. ప్రస్తుతం డ్యాంలో 88.828 టిఎంసిలు నీటి నిల్వ ఉండడం కొంతలో కొంత ఉపశమనం. గతేడాది ఇదే సమయంలో రిజర్వాయర్ నిల్వ 80.003 టిఎంసిలు మాత్రమే. అంటే గతేడాది కంటే ఈ ఏడాది నీటి నిల్వ ఎక్కువే. ప్రస్తుతం కొత్తగా ఇన్ ఫ్లో లేకుండా రోజూ దాదాపు పదివేల క్యూసెక్కులు నీటి విడుదల కొనసాగితే మాత్రం నిల్వలు వేగంగా తగ్గుబోయి పరిస్థితి ప్రమాదకరంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

తేదీల వారీ వివరాలు ఇలా

ఆగస్టు 8 – 42,114 క్యూసెక్కులు
ఆగస్టు 9 – 21,613 క్యూసెక్కులు
ఆగస్టు 23 – 8,680 క్యూసెక్కులు
ఆగస్టు 29 – 11,574 క్యూసెక్కులు
ఆగస్టు 31 – 8,416 క్యూసెక్కులు
సెప్టెంబర్ 3 – 5,205 క్యూసెక్కులు
సెప్టెంబర్ 5 – 4,241 క్యూసెక్కులు
సెప్టెంబర్ 7 – 2,334 క్యూసెక్కులు
సెప్టెంబర్ 8 – 1,351 క్యూసెక్కులు
సెప్టెంబర్ 9 – 915 క్యూసెక్కులు
సెప్టెంబర్ 10 – సగటున 70 క్యూసెక్కులు

ప్రస్తుత ఇన్ ఫ్లో సున్నా

సెప్టెంబర్11 – నిల్
సెప్టెంబర్12 – నిల్

ఇన్ ఫ్లో ఎలా పడిపోయిందంటే...

తుంగభద్ర డ్యామ్‌కు పైనుంచి వచ్చే ప్రవాహాలు రోజు రోజుకు పడిపోతూ వస్తున్నాయి. ఆగస్టు నెల నుంచి రోజు వారీ ఇన్ ఫ్లో వివరాలు పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

పంటలు ధ్వంసం చేసిన వారిపై కేసులు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ డిమాండ్

ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్

విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల ఏర్పాటు కోసం అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలో దళిత రైతుల పంటను జెసిబిలతో ధ్వంసం చేసిన పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం గణేనాయక్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలం సీదారఘట్ట గ్రామంలోని రైతుల భూములను 'రిసోనియా' అనే ప్రైవేట్ కంపెనీకి కారుచౌకగా ప్రభుత్వం కట్టబెట్టిందని విమర్శించారు. ఎల్సీనగర్‌కు చెందిన దళితులు అమర్, రాముసుబ్బమ్మ, లక్ష్మీదేవి, సుంకన్న రైతుల సాగు భూములను బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. భూములు ఇవ్వబోమని చెబుతున్నా వందలాది మంది పోలీసులతో వచ్చి భయాందోళనలు సృష్టించి, పచ్చని పంటలను జెసిబిలతో నాశనం చేయడం సర్కారు నిరంకుశత్వానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. నంద్యాల జిల్లాలో కలెక్టర్ జారీ చేసిన ప్రొసీడింగ్స్ ప్రకారం ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణంలో నష్టపోతున్న రైతులకు సెంటుకు రూ. 85,000 చొప్పున పరిహారంతో పాటు, జాతీయ రహదారి సమీప భూములకు అదనంగా 150 శాతం భూమి ధర, ఆర్‌ఒడబ్ల్యు పరిహారం 30 శాతం, పంటలు, బోర్‌వెల్‌లకు నష్టపరిహారాన్ని నిర్ణయించారన్నారు. నంద్యాల తరహాలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన నిబంధనలను ఇక్కడ ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. పంటలను ధ్వంసం చేసిన అధికారులపై ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక (పిఒఎ) చట్టం కింద వెంటనే కేసులు నమోదు చేయాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్, ఎస్‌పిలు జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేసేలా వ్యవహరించాలన్నారు. రైతుల కడుపు కొట్టి ప్రయివేటు కంపెనీలకు లాభాలు రాసిచ్చే వైఖరిని ప్రభుత్వం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో బాధితుల తరఫున సిపిఎం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ. నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు టి రామాంజనేయులు పాల్గొన్నారు.

రిసోనియా కంపెనీపై చర్యలకు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

హైటెన్షన్ విద్యుత్ టవర్లు, విద్యుత్ లైన్ల నిర్మాణంలో భాగంగా అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం శ్రీధర్ ఘట్ట పరిధిలో రైతులపై రెవెన్యూ, పోలీస్ అధికారుల దౌర్జన్యకాండను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఖండించింది. బాధ్యులైన ప్రభుత్వ అధికారులు, విద్యుత్ టవర్ల నిర్మాణ సంస్థ రిసోనియాపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి. క్రిష్ణయ్య, కె ప్రభాకర రెడ్డి శనివారం ప్రకటన విడుదల చేశారు. రైతుల జిరాయితీ పట్టా భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా అధికారులు దౌర్జన్యం చేయడం ఇదెక్కడి న్యాయం? చట్ట విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై, రిసోనియా కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

ప్రజాశక్తి- తిరుమల

తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) కు సంబంధించిన డిసెంబర్ కోటాను సెప్టెంబర్ 19 ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో టిటిడి విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 21 ఉదయం పది గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 21 నుండి 23 మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. పూర్తి వివరాలకు టిటిడి వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

ఏజెన్సీలో అప్రమత్తం

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లాలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వాగులు, వంకలు పొంగుతున్నందున ప్రమాదకర ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు అవసరమైనచోట పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులతో సమీక్షించినట్లు శనివారం ఎక్స్ ద్వారా తెలిపారు. వర్షాలు తగ్గే వరకు అత్యవసర పరిస్థితులు మినహా ప్రజలు బయటకు రాకుండా అవగాహన కల్పించాలన్నారు. పలు ప్రాంతాల్లో వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయని, కొన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జికె వీధి మండలం గంగవరం సమీపంలో ఏపి, ఒడిశా సరిహద్దులో ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన వరద ప్రవాహానికి కొట్టుకుపోవడంతో సుమారు 15 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయినట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యామ్నాయ రాకపోకల ఏర్పాట్లపై దృష్టి సారించాలని పవన్‌కల్యాణ్ సూచించారు. అవసరమైన చోట తక్షణమే పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు.

బుడమేరు పరిధిలో ఆక్రమణలకు తావివ్వొద్దు

- అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ సమీపంలోని బుడమేరు వాగు పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అక్రమ నిర్మాణాలపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎక్కడైనా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే స్పందించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు విద్యుత్, నీటి కనెక్షన్లు ఇవ్వొద్దని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. బుడమేరు వరదల సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టు ఎన్ భూపతిరావు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంతోపాటు, కాలువలు, నదులు, వాగులు, ఇతర నీటి వనరుల భూముల్లోని ఆక్రమణలను తొలగించాలని కోరుతూ సామాజిక కార్యకర్త పర్వతనేని హరికృష్ణ దాఖలు చేసిన మరో వ్యాజ్యాన్ని డివిజన్ బెంచ్ విచారించింది. ఆక్రమణల నివారణతోపాటు ఇతర అంశాలపై దృష్టి పెట్టేందుకు సంబంధిత శాఖాధిపతులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది యతీంద్రదేవ్ తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరు ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశారని వివరించారు. విచారణ నవంబరు 18కి వాయిదా పడింది.

ఆరేళ్ల తర్వాత

గ్వాంగ్‌జౌ-న్యూఢిల్లీ విమాన సర్వీసులు

- చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ పునరుద్ధరణ

న్యూఢిల్లీ : కరోనా తర్వాత తూర్పు లడక్ సరిహద్దు వివాదాల కారణంగా గత ఆరేళ్లుగా నిలిచిపోయిన గ్వాంగ్‌జౌ-న్యూఢిల్లీ విమాన సర్వీసులను సెప్టెంబర్ 21 నుంచి తిరిగి ప్రారంభించనున్నట్లు చైనా సదరన్ ఎయిర్‌లైన్స్ శనివారం ప్రకటించింది. బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జి జిన్పింగ్ భారత్‌లో పర్యటిస్తున్న వేళ ఈ కీలక నిర్ణయం వెలువడింది. భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాలను సాధారణ స్థితిలోకి తీసుకొచ్చే అంశంలో భాగంగా ఈ సర్వీసులు పునరుద్ధరిస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. దక్షిణాసియాలో ఎనిమిది రౌండ్-ట్రిప్ రూట్లలో వారానికి 100కి పైగా విమానాలను నడుపుతున్నామని, ఈ సర్వీసుల పునరుద్ధరణ ఇరు దేశాల మధ్య ప్రయాణ, వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుస్తుందని ఆ కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఎండిన చీనీ పంటను పరిశీలిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ

జాతీయ విపత్తుగా 'అనంత' కరువు : సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి - రాప్తాడు (అనంతపురం జిల్లా)

తీవ్ర వర్షాభావంతో పంటలన్నీ ఎండిపోయిన నేపథ్యంలో అనంతపురం జిల్లా కరువును జాతీయ విపత్తుగా ప్రకటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. రాప్తాడు మండలం గంగులకుంట గ్రామంలో శనివారం ఆయన పర్యటించి ఎండుతున్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చీనీ చెట్లు పూర్తిగా ఎండిపోయాయని, వేరుశనగ, కంది పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. పరిస్థితులు ఇంత తీవ్రంగా ఉన్నా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కరువు నివారణకు తగిన చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇంతవరకు కరువుపై స్పందించకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సమీక్ష సమావేశంలో సైతం కరువు అంశం ఎజెండాలో లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

కుమారుడి మృతికి న్యాయం దక్కలేదని తల్లి మృతి

- సెల్ఫీ వీడియో విడుదల చేసిన అనంతరం బలవన్మరణం

ప్రజాశక్తి- శింగరాయకొండ

కోచింగ్ సెంటర్ ఎదుట ధర్నా చేస్తున్న మౌలాబీ (ఫైల్)

ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించిన తన కుమారుడు తౌసిక్ మృతికి న్యాయం చేయాలని, సదరు సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టిన విద్యార్థి తల్లికి న్యాయం దక్కకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. గత ఫిబ్రవరి 14న ఆరో తరగతి చదువుతున్న కనిగిరికి చెందిన విద్యార్థి షేక్ తౌసిక్ మృతి చెందిన విషయం తెలిసిందే. కుమారుడు మృతికి కారణం తెలపాలని అప్పటి నుంచి తౌసిక్ తల్లి పోరాటం చేస్తూనే ఉన్నారు. దీనిపై అప్పట్లో విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు పెద్ద ఎత్తున పోరాటం చేశారు. ఫలితంగా పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. చివరకు కోర్టుకు కూడా వెళ్లారు. అయినా ఆ విచారణలు, నివేదికలు ఏవీ బయటకు రాలేదు. ఆ విద్యార్థి ఆత్మహత్యకు కారణం వెల్లడి కాలేదు. దీంతో తన కుమారుడి మరణానికి కారణం తెలపాలని, అనుమతి లేని కోచింగ్ సెంటర్ మూసివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి తల్లి మౌలాబీ పాఠశాల ముందు గత 15 రోజులుగా న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం సమయంలో ఒక సెల్ఫీ వీడియోను ఆమె విడుదల చేశారు. 'తన బిడ్డ ఫిబ్రవరి 14న చనిపోయాడని, అప్పటి ఎస్ఐ, సిఐ తనను ఇబ్బంది పెట్టారు. ఆ తర్వాత పాఠశాలపై ఉన్న అనుమానాలపై జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దగ్గరికి వెళ్లి ఎన్నో వివరాలు చెప్పినప్పటికీ పాఠశాల నిర్వాహకుల్లో ఒకరైన రమణారెడ్డి చాలా మంచివాడని, అతని ద్వారా నీకు సహాయం చేయిస్తానని, అతని జోలికి వెళ్ళొద్దన్నారు. తన భర్తను, తనను జిల్లా విద్యాశాఖ అధికారి భయపెట్టారు. ప్రజాస్వామ్యంలో తనకు న్యాయం జరగలేదని, గత 15 రోజులుగా పాఠశాల ముందు న్యాయ పోరాటం చేస్తుంటే ఏ ఒక్క అధికారి తనతో మాట్లాడిన దాఖలాలు లేవు. శాంతియుతంగా న్యాయ పోరాటం చేస్తుంటే తనను ఎన్నో ఇబ్బందులు గురి చేశారు. తన చావుకు కోచింగ్ నిర్వాహకులు వాకా రమణారెడ్డి, వాకా సుజాత, వాకా చైతన్య రెడ్డి, మారెడ్డి అనూష, బాబ్జీ కారణం. వాళ్లకు శిక్ష పడాలి,' అని వీడియోలో కోరారు. ఆ తర్వాత కోచింగ్ సెంటర్ వద్దకు వెళ్లి పురుగుల మందు తాగారు. తొలుత ఒంగోలు, తరువాత హైదరాబాద్‌లో చికిత్స తీసుకున్నప్పటికీ ఫలితం లేకపోవడంతో శనివారం మరణించారు.

'టాటా సన్స్'ను లిస్టింగ్ చేయాల్సిందే..!

- మినహాయింపునకు ఆర్‌బిఐ తిరస్కరణ

ముంబయి : టాటా గ్రూప్ ప్రధాన హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నుంచి ఎదురుదెబ్బ తగిలింది. కోర్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ (సిఐసి) నిబంధనల నుంచి మినహాయింపు కోరుతూ టాటా సన్స్ చేసిన దరఖాస్తును ఆర్‌బిఐ తిరస్కరించింది. దీంతో టాటా సన్స్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2022 సెప్టెంబరులో టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీగా ఆర్‌బిఐ వర్గీకరించింది. ఈ కేటగిరీలో ఉన్న సంస్థలు నిర్దేశిత గడువులోగా స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కావాల్సి ఉంటుంది. టాటా సన్స్‌కు ఇచ్చిన మూడేళ్ల గడువు 2025 సెప్టెంబరుతో ముగిసింది. అయితే అప్పటికి కంపెనీ లిస్టింగ్ పూర్తి చేయలేదు.

రిజిస్ట్రేషన్ రద్దుకు ప్రయత్నం

తన రుణాలు తీరిపోయిన నేపథ్యంలో సిఐసిగా కొనసాగాల్సిన అవసరం లేదంటూ టాటా సన్స్ తన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సరెండర్ చేసేందుకు ప్రయత్నించింది. అయితే ఈ దరఖాస్తును కూడా ఆర్‌బిఐ అంగీకరించలేదు. 2026 సెప్టెంబర్ 11న పంపిన లేఖలో మినహాయింపు కోరిన టాటా సన్స్ అభ్యర్థనను అంగీకరించడం సాధ్యం కాదని ఆర్‌బిఐ స్పష్టం చేసినట్లు సమాచారం.

ఛైర్మన్ మార్పు వేళ..

టాటా సన్స్‌లో నాయకత్వ మార్పు చర్చలు జరుగుతున్న సమయంలో ఆర్‌బిఐ నిర్ణయం వెలువడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుత ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ పదవీకాలం 2027 ఫిబ్రవరి 20తో ముగియనుంది. ఆయన మరోసారి ఛైర్మన్‌గా కొనసాగేందుకు సుముఖంగా లేరని బోర్డుకు తెలిపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టాటా సన్స్ భవిష్యత్ యాజమాన్య నిర్మాణంతో పాటు లిస్టింగ్ అంశం కూడా కీలకంగా మారింది.

వాటాదారుల్లో భిన్నాభిప్రాయాలు

టాటా సన్స్‌లో ప్రధాన వాటాదారుగా ఉన్న టాటా ట్రస్ట్ లిస్టింగ్‌ను వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. మరోవైపు రెండో అతిపెద్ద వాటాదారు షాపూర్జీ పల్లోంజీ గ్రూప్ మాత్రం వాటాల విక్రయం, పబ్లిక్ లిస్టింగ్‌కు అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. లిస్టింగ్ జరిగితే టాటా సన్స్ యాజమాన్య నిర్మాణం, వాటాదారుల ప్రయోజనాలు, కార్పొరేట్ పాలనపై ప్రభావం పడే అవకాశం ఉంది.

భారీ నిధుల సమీకరణకు అవకాశం

సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ వంటి భారీ పెట్టుబడులు అవసరమైన రంగాల్లో టాటా గ్రూప్ విస్తరణకు లిస్టింగ్ ద్వారా నిధులు సమీకరించే అవకాశం ఉంటుంది. అదే సమయంలో పబ్లిక్ కంపెనీగా మారితే ఆర్థిక వ్యవహారాలు, కార్పొరేట్ పాలనలో పారదర్శకత మరింత పెరగవచ్చు. అయితే టాటా గ్రూప్ ప్రస్తుత నిర్మాణం, ట్రస్టుల ఆధిపత్యం, దాని సామాజిక సేవా లక్ష్యాలపై లిస్టింగ్ ప్రభావం ఎలా ఉంటుందన్నది కీలక ప్రశ్నగా మారింది.

HINDUJA HOUSING FINANCE LIMITED
అనుబంధం-IV-A
ఈ-వేలం కమ్ అమ్మకం కొరకు ప్రజా ప్రకటన (అనుబంధం - IV A) (నియమం 9(1))
www.bankeauctions.com
HDFC BANK LTD.
LanNo:APIKURIKURLIA00001100

సైబర్ నేరాల నియంత్రణకు 'క్లిక్` బృందాలు

- రాజమహేంద్రవరంలో ఫోరెన్సిక్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో డిజిపి హరీష్ కుమార్ గుప్త

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

సైబర్ నేరాల నియంత్రణకు 'క్లిక్' పేరుతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలాచెరువు పెట్రోలు బంకు సమీపంలో నెలకొల్పిన ఫోరెన్సిక్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సైబర్ నేరాలను అరికట్టేందుకు స్పెషలిస్ట్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌లు, బ్యాంకర్లు, టెలికాం ఆపరేటర్ల ప్రతినిధులతో కూడిన సైబర్ వార్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సైబర్ నేరం జరిగిన 30 నిమిషాల(గోల్డెన్ పీరియడ్)లోనే స్పందించి బాధితుల అకౌంట్లను ఫ్రీజ్ చేసేలా టీమ్ చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లా స్థాయిలో 'క్లిక్' టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో బిటెక్, ఎంటెక్, ఎంసిఎ విద్యార్హతలు కలిగిన 20 మంది కానిస్టేబుళ్లతో ఈ 'క్లిక్' ప్రత్యేక సైబర్ టీమ్‌లను ఎస్‌పి పర్యవేక్షణలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిజిటల్ ఫోరెన్సిక్ టూల్స్ వినియోగంతో పాటు అవసరమైతే ప్రైవేట్ లాబొరేటరీలతో ఒప్పందాలు, నిపుణులను కాంట్రాక్టు లేదా అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తామని చెప్పారు. గోదావరి పుష్కరాలకు ఎఐ, డ్రోన్లతో బందోబస్తు నిర్వహించేలా ప్రణాళికలురూపొందించామన్నారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఘాట్ల వద్ద యాత్రికుల రద్దీని ముందుగా గుర్తించేందుకు ఈ ఆధునిక సాంకేతికత ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తిరుమల తరహా మోడల్ గా తిరుమల శ్రీవారి దర్శనంలో ఉపయోగించే కంపార్ట్‌మెంట్ విధానం తరహాలోనే ఘాట్ల వద్ద యాత్రికులను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజమహేంద్రవరంలో రెండు వేల సిసి కెమెరాలను నిరంతరం రికార్డింగ్ మోడ్‌లో ఉంచి కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా ఏర్పాటు చేస్తామని వివరించారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డిజిపి

'ప్రియాంక' నిందితులకు కఠిన శిక్ష

డాక్టర్ ప్రియాంక మృతి ఘటనపై డిజిపి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నిందితులకు స్పెషల్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ఏమైనా అనుమానాలు ఉంటే నేరుగా నివృత్తి చేస్తామని స్పష్టం చేశారు. లవ్ జిహాద్ ఆరోపణలపై స్పందిస్తూ ఇప్పటి వరకూ జరిగిన పోలీసు దర్యాప్తులో అలాంటి ఆధారాలు ఏవీ నిరూపితం కాలేదని స్పష్టం చేశారు. ఆయన వెంట ఏలూరు రేంజ్ డిఐజి అశోక్, ఎస్.పి నరసింహకిశోర్, డిఎస్‌పిలు తదితరులున్నారు.